# పర స్త్రీ

**మా** ఆఫీసులో చిన్న ఉద్యోగం ఖాళీపడింది. కొండలరావు జబ్బుచేసి మంచాన పడ్డాడు. ఒక నెల రోజులదాకా లేచే ఆశలేదని డాక్టరు చెబితే అతనికి బదులు పనిచెయ్యటానికి సుబ్రహ్మణ్యం అనే అతను గుంటూరు నించి భార్యా సమేతంగా దిగాడు. నెలరోజుల భాగ్యానికి కాపరం దేనికో? ఇక్కడ సంపాయించే నాలుగు డబ్బులూ రైలు చార్జీ కింద ధారపొయ్యటానికి కాకపోతే!

సుబ్రహ్మణ్యం ఆఫీసుకు సమీపంలోనే ఒక పదిరూపాయల భాగం అద్దెకు తీసుకుని అందులో కాపరం పెట్టాడు. సుబ్రహ్మణ్యం భార్య చాలా అందగత్తె. పరాయివాళ్లతో కూడా కలుగుగోలుగా మాట్లాడుతుంది. మా ఆఫీసులో చాలా మందిని సుబ్రహ్మణ్యం గారింటికి వెళ్లి కాసేపు కూర్చుని వస్తూ ఉండేవాళ్లం.

నెలరోజులెంతలోకి అయిపోతై? సుబ్రహ్మణ్యం ఉద్యోగం పూర్తి కావచ్చింది. కాని కొండలరావింకా కోలుకోలేదు. అయితే, సుబ్రహ్మణ్యం మాత్రం నెల పూర్తికాగానే భార్యను కాస్తా పంపించేసి హోటలు భోజనం ప్రారంభించాడు.

ఇంతలో కొండలరావు కాస్తా గుటుక్కుమన్నాడు. సుబ్రహ్మణ్యానికి నౌకరీ ఖాయపడ్డది.

"నీ భార్యను మళ్లా ఎప్పుడు తెస్తావోయ్?" అని సుబ్రహ్మణ్యాన్ని అఫీసు పాతీ అడిగాం.

'తెస్తాను తొందరేం?' 'అసలు తీసుకునేరాను!' 'ఉత్తరం రాద్దామని చూస్తున్నాను!' 'ఎవతెనన్నా పెట్టుకుని ఓ నెల కాలక్షేపం చేసి తర్వాత తెద్దామనుకుంటున్నాను!' ఈ విధంగా ఒకడికి చెప్పినట్టు మరొకడికి చెప్పకుండా సమాధానాలు చెప్పాడు సుబ్రహ్మణ్యం.

మా ఆఫీసులోనే పనిచేసే భగవాన్లు కూడా ప్రస్తుతం సుబ్రహ్మణ్యం ఇంట్లోనే చేరినట్టు తెలిసింది. ఇంకేం? ఈ ఇద్దరూ కలిసి ఎవతెనో పెట్టబోతున్నారని పుకారు పడింది.

"నా భార్య ఎల్లుండి వస్తుంది!" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"భగవాన్లు?" అన్నాం.

"వాడూ మా ఇంట్లోనే ఉంటాడు" అన్నాడు సుబ్రహ్మణ్యం.

ఆరోజే ఎవరే వెళ్లి సుబ్రహ్మణ్యం ఇంటివాళ్లతో ఊదొచ్చారు - ఇంట్లో ఉన్న ఇద్దరూ ఎవతెనో తెచ్చిపెట్టబోతున్నారు. గనక తక్షణం వాళ్లని వెళ్లగొట్టమని.

ఇంటివాడు సుబ్రహ్మణ్యానికీ భగవాన్లుకూ నోటీసిచ్చాడు.

"రెండో నెల ఆఖరయిందాకా లేను. నువు ప్రివీకౌన్సిలుకు పోయినా సరే!" అన్నాడు సుబ్రహ్మణ్యం.

త్వరలోనే ఆ ముండు వచ్చింది - వట్టి పాపిష్టి మొహమూ అదీనూ! దాన్ని చూస్తేనే మా కందరికీ రోతపుట్టింది. చక్కని భార్యను పెట్టుకుని వీడికిదేం పొయ్యేకాలమా అని నేను అనుకున్నాను.

ఆ మనిషి వచ్చిన తరువాత ఒకపూట ఉండి భగవాన్లు కూడా ఆ ఇల్లు వదిలి వేరే గది చూసుకున్నాడు. బుద్ధిమంతుడు.

ఇంతలో ఒకనాడు మా ఆఫీసుకొక పెద్దమనిషి వచ్చాడు - "సుబ్రహ్మణ్యం ఉన్నాడా?" అంటూ. మేమడిగిన మీదట ఆయన సుబ్రహ్మణ్యం పినమామగారని తెలిసింది.

"ఇంకా సుబ్రహ్మణ్యం రాలేదు. వచ్చేవేళ అయింది... సరేగాని మీ పిన్నల్లుడు ఎవతెనో పెట్టుకుని ఉంటున్నాడు. పెద్దవారు మీరన్నా చెప్పరాదా?" అని నేనన్నాను.

"ఎవతెనో పెట్టుకుని ఉండటమేమిటి, నీ మొహం! అది వాడి పెళ్లామే! నేనిప్పుడేగా వాడింటికి వెళ్లి వస్తున్నదీ? వాడింటోనూ లేదు! ఏమైనాడో..." అని గొనుక్కుంటూ ఆ పెద్దమనిషి వెళ్లిపోయినాడు.

*ముద్రణ : కవిరాట్టు, అభూత కల్పనలు - గల్పికలు, 1942*
*యువ కార్యాలయం, తెనాలి*